

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | సోమవారం 23 నవంబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 59 | పేజీలు : 04, వెల రూ.2

ఏపీలో మూడు కొత్త రైల్వే లైన్లు.. శ్రీశైలం, ఏజెన్సీ ప్రాంతాలకు రైలు మార్గం!



రాష్ట్రంలో మూడు కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

మార్కాపురంశ్రీశైలం, రాజంపేటనెల్లూరు, సామర్లకోటచింతూరు మార్గాలు

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలానికి రైలు కనెక్టివిటీ

గిరిజన ప్రాంతాలకు విస్తరించనున్న రైల్వే సేవలు

రైల్వే బోర్డు పరిశీలనలో ఉన్న ప్రాజెక్టుల ప్రతిపాదనలు

అమరావతి : ఏపీలో రైల్వే నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో మూడు అత్యంత ముఖ్యమైన కొత్త రైల్వే మార్గాల నిర్మాణానికి దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపారు. మార్కాపురంశ్రీశైలంసికింద్రాబాద్, రాజంపేటనెల్లూరు, సామర్లకోటచింతూరు మార్గాల్లో ఈ కొత్త లైన్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. మిగతా..2లో

సిద్ధిపేట 'సదర్'లో హరీశ్ రావు జోష్..



సిద్ధిపేటలో ఘనంగా నిర్వహించిన సదర్ వేడుక

సందడి చేసిన మాజీ మంత్రి హరీశ్ రావు

త్వరలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా

సర్వేలు సైతం బీఆర్ఎస్ పునరాగమనాన్ని స్పష్టం చేస్తున్నాయన్న నేత

సోషల్ మీడియాలో సదర్ ఫొటోలను పంచుకున్న హరీశ్ రావు

హైదరాబాద్: సిద్ధిపేట పట్టణంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొని సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా సాగిన ఈ వేడుకల్లో ఆయన యాదవ సోదరులతో కలిసి ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. స్థానిక ప్రజలు, యువతతో మమేకమై పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మిగతా..2లో

పంచాయతీ ఎన్నికల్లో జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ.. ఎవరైనా పోటీ చేయవచ్చు



- పంచాయతీ ఎన్నికల్లో పోటీపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ప్రకటన
- పార్టీ శ్రేణులు ఎవరైనా స్వేచ్ఛగా నామినేషన్లు వేయవచ్చని స్పష్టీకరణ
- పోటీ చేయాలనుకునే వారిని నాయకులు ఎవరూ అడ్డుకోవద్దని ఆదేశం
- పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి సీట్ల పంపకాలు ఉండవని వెల్లడి
- స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎన్నికలు జరగాలని పిలుపు

పంచాయతీ ఎన్నికల్లో పంతాలకు పోవద్దు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

- పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- స్థానిక సంస్థల ఫలితాలు ప్రజాభిప్రాయానికి నిదర్శనమన్న సీఎం చంద్రబాబు
- పంచాయతీల్లో ఏకగ్రీవాల కోసం గ్రామ నేతలతో మాట్లాడాలని ఎమ్మెల్యేలకు సూచన
- ఏకగ్రీవ పంచాయతీలకు జనాభాను బట్టి రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు
- పార్టీ నేతల మధ్య పంతాలు వీడి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపు



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలను విస్తృతంగా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలు, మంత్రులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో తాజాగా టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల వెలువడిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల సన్నద్ధత, ఏకగ్రీవాల ఆవశ్యకత తదితర అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. టెలీకాన్ఫరెన్స్ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇటీవల పార్టీ గుర్తులపై జరిగిన మున్సిపల్, మిగతా..2లో

జర్మనీలో నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంత గౌరవిస్తారో నాకు తెలుసు



- ★ ఐఐటీలతో సమానంగా ఐటీఐలకు గుర్తింపు దక్కాలన్న లోకేశ్
- ★ ప్రధాని మోదీ పోస్టుకు ఏపీ విద్యాశాఖ మంత్రి మద్దతు
- ★ ఏఐ కాలంలో టెక్నికల్ నైపుణ్యాలకే అధిక విలువ
- ★ జర్మనీ పరిశ్రమల అనుభవాన్ని ప్రస్తావించిన లోకేశ్
- ★ వృత్తి విద్యపై సమాజంలో ఉన్న భావన మారాలన్న పిలుపు

అమరావతి : ఐఐటీ విద్యార్థులతో సమానంగా ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) విద్యార్థులకూ మిగతా..2లో

చైనా బార్డర్‌లోని 40 గ్రామాల్లో జనాభా పెరిగింది వలసలు ఆగిపోయాయ్



- కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సరిహద్దు రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌కు తగినన్ని నిధులు కేటాయించలేదని కేంద్ర మంత్రి అమిత్ షా ఆరోపించారు.

ఢిల్లి : అరుణాచల్ ప్రదేశ్‌లోని చైనా సరిహద్దులో ఉన్న 40 గ్రామాల్లో జనాభా పెరిగిందని, వలసలు ఆగిపోయాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అక్కడ ఉపాధి, ఆరోగ్య సౌకర్యాలు కల్పించిందని స్పష్టం చేశారు.

భారతీయ సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు ఏమాత్రం అవగాహన లేదు

భారతీయ ఆధ్యాత్మిక, మత సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు ఏమాత్రం అవగాహన లేదంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు.



ఢిల్లి : భారతీయ ఆధ్యాత్మిక, మత సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు ఏమాత్రం అవగాహన లేదంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారతీయ ఆధ్యాత్మిక, మత సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు ఏమాత్రం అవగాహన లేదంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఎలిఫెంటా గుహల్లో శివుడి ఒడిలో పార్వతీ దేవి కూర్చున్న 12వ శతాబ్దపు శిల్పం ఫొటోను షేర్ చేశారు. నిజమైన హిందువుగా వారిని ఆ వలయం నుంచి బయటకు తీసుకురావడం తన బాధ్యత అంటూ 'సత్యం శివం సుందరం' అని రాహుల్ పేర్కొన్నారు. భారతీయ ఆధ్యాత్మిక, మత సంప్రదాయాలను లోతుగా అర్థం చేసుకునేకొద్దీ ఒక విషయం స్పష్టమవుతోందని, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు సంస్కారం లేని, కులతత్వం, పురుషాధిక్య భావజాలం కలిగి ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల హృదయాల్లో భయం, కోపం, ద్వేషం గూడుకట్టుకున్నాయని, అందుకే వారు ప్రేమను మిగతా..2లో

బంగారం కొనుగోళ్లు వాయిదా వేయాలన్న మోదీ సలహాకు వ్యాపార సంఘం కృతజ్ఞతలు..

- కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలన్న బీజేపీ
- బంగారం కొనుగోళ్ల వాయిదాపై ప్రధాని మోదీ ఇచ్చిన సూచనను సమర్థించిన బీజేపీ
- కాంగ్రెస్ పార్టీ ప్రజలకు, వ్యాపారులకు క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్
- ప్రధాని సూచనతో వ్యాపారులు నష్టాల బారిన పడకుండా కాపాడారన్న సీటీఐ
- కిలో బంగారంపై రూ. 65 లక్షల వరకు తగ్గిన ధరతో కొనుగోలుదారులకు ఊరట



ఢిల్లి : బంగారం కొనుగోళ్లను కొంతకాలం వాయిదా వేసుకోవాలంటూ గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన సలహా వ్యాపారులను, మదుపర్లను భారీ నష్టాల నుంచి కాపాడిందని బీజేపీ పేర్కొంది. నాడు ప్రధాని చేసిన సూచనను 'డెత్ వారెంట్'గా అభివర్ణిస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించినందుకు గాను కాంగ్రెస్ పార్టీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు వ్యాపార సంఘమైన ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ లేఖ రాసింది. మార్కెట్లో బంగారం ధరలు కిలోకు రూ. 1.90 కోట్ల నుంచి రూ. 1.25 కోట్లకు చేరి, మిగతా..2లో

తెలంగాణలో ష్నైడర్ సంస్థ విస్తరణకు పూర్తి సహకారం అందిస్తాం



- డేటా సెంటర్ల హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.
- పారిస్‌లో ష్నైడర్ ఎలక్ట్రిక్ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమావేశం అయ్యారు.

ఇంటర్నెట్ డెస్క్, నవంబరు 22 : డేటా సెంటర్ల హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. పారిస్‌లో ష్నైడర్ ఎలక్ట్రిక్ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమావేశం అయ్యారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం.. కొత్త మార్గదర్శకాలు, ?

- ప్రతి రేషన్ కార్డుకు ఒకరి చొప్పున రూ.5 లక్షల జీవిత బీమా
- 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న వారు దరఖాస్తుకు అర్హులు
- డిసెంబర్ 18 వరకు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు
- ప్రభుత్వమే పూర్తి ప్రీమియం చెల్లిస్తుందని స్పష్టీకరణ



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' అమలుకు సంబంధించి సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకం కింద అర్హత కలిగిన ప్రతి కుటుంబంలో ఒకరికి రూ. 5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనుండగా, ప్రతి రేషన్ కార్డుకు ఒకరు మాత్రమే ఈ బీమాకు అర్హులని ప్రభుత్వం స్పష్టం చేసింది. మిగతా..2లో

రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా మంత్రి తుమ్మల నయా ప్రతిపాదన



- ఆయిల్‌పామ్ రైతులకు విద్యుత్ లైన్ల సమస్యకు పరిష్కారం చూపే దిశగా తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రతిపాదన చేశారు.
- బహిరంగ విద్యుత్ తీగల స్థానంలో ఏబీ కేబుల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

హైదరాబాద్, నవంబరు 22: ఆయిల్‌పామ్ రైతులకు విద్యుత్ లైన్ల సమస్యకు పరిష్కారం చూపే దిశగా తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రతిపాదన చేశారు. బహిరంగ విద్యుత్ తీగల స్థానంలో ఏబీ కేబుల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి ఈ ప్రతిపాదనను తీసుకువచ్చారు. ఈరోజు (ఆదివారం) మంత్రి తుమ్మల ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ లైన్ల కారణంగా ఆయిల్‌పామ్ తోటల్లో మొక్కల సంఖ్య తగ్గుతోందని తెలిపారు. దీనివల్ల ఎకరాకు 6 నుంచి 8 మొక్కలుమిగతా..2లో

మొదటి పేజి తరువాయి

పంచాయతీ ఎన్నికల్లో జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ.. ఎవరైనా పోటీ చేయవచ్చు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే జనసేన పార్టీ శ్రేణులకు ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ పూర్తి స్వేచ్ఛనిచ్చారు. పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు ఎవరైనా ఎలాంటి రాజకీయపరమైన అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల బరిలో నిలవవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకొచ్చే జనసేన శ్రేణులను పార్టీలోని నాయకులు ఎవరూ అడ్డుకోకూడదని పవన్ కల్యాణ్ కరాఖండిగా ఆదేశాలు జారీ చేశారు. స్థానిక స్థాయిలో ప్రజాసేవ చేయాలనే ఆసక్తి, ప్రజల మద్దతు ఉన్న ప్రతి ఒక్కరికీ అవకాశం దక్కాలన్నదే తమ విధానమని పేర్కొన్నారు. మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తరహాలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి స్థానాల పంపకాలు (సీట్ల సర్దుబాటు) ఉండవని పవన్ కల్యాణ్ తేల్చిచెప్పారు. పంచాయతీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతంగా, స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జరిగే ఎన్నికలని ఆయన గుర్తుచేశారు. ఈ క్రమంలో పోటీ చేయాలనుకునే ప్రతి పౌరుడికి నామినేషన్ దాఖలు చేసే పూర్తి హక్కు ఉంటుందన్నారు. జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తుందని, రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి స్వేచ్ఛాపూరిత వాతావరణంలో, నిష్పక్షపాతంగా జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని సూచించారు.

తెలంగాణలో ష్నైడర్ సంస్థ విస్తరణకు పూర్తి సహకారం అందిస్తాం

ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ నెల 30వ తేదీన ష్నైడర్ నూతన కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో తయారీ సామర్థ్యాలను ష్నైడర్ సంస్థ విస్తరించాలని సూచించారు.

5 వేల మందికి పైగా ఉపాధి..

డేటా సెంటర్ల రంగంలో భారీ పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని భట్టి విక్రమార్క వివరించారు. విద్యుదీకరణ, డిజిటలైజేషన్, ఆటోమేషన్‌కు తెలంగాణలో విస్తృత అవకాశాలు ఉన్నాయని ప్రస్తావించారు. తెలంగాణలో ఇప్పటికే ష్నైడర్‌కు తయారీ, పరిశోధన యూనిట్లను నెలకొల్పుతున్నట్లు చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఈ సంస్థ ద్వారా 5 వేల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయి లైట్‌హౌస్ యూనిట్‌గా తెలంగాణ కేంద్రానికి గుర్తింపు ఉందని వివరించారు. తెలంగాణలో ష్నైడర్ సంస్థ విస్తరణకు పూర్తి సహకారం అందిస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.

రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా మంత్రి తుమ్మల నయా ప్రతిపాదన

నాటే అవకాశాన్ని అన్నదాతలు కోల్పోతున్నారని చెప్పుకొచ్చారు.

35 ఏళ్లలో రూ.27.45 లక్షల స్థూల ఆదాయం..

ఏబీ కేబుల్స్ ఏర్పాటుతో సాగు భూమిని పూర్తిస్థాయిలో వినియోగించడానికి అవకాశం ఉంటుందని మంత్రి తుమ్మల వివరించారు. నిర్మల్ జిల్లా కనకాపూర్‌లో క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ సమస్య వెలుగులోకి వచ్చిందని అన్నారు. 20 ఆయిల్‌పామ్ మొక్కల ద్వారా 35 ఏళ్లలో రూ.27.45 లక్షల స్థూల ఆదాయం వస్తుందని చెప్పుకొచ్చారు. విద్యుత్ లైన్‌ను ఏబీ కేబుల్‌గా మార్చేందుకు అయ్యే ఖర్చు కేవలం రూ.1.45 లక్షలని తెలిపారు. ఏబీ కేబుల్స్‌తో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్లు, అగ్నిప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని అన్నారు.

రైతులకు అదనపు ఆదాయం..

అన్నదాతలపై భారం పడకుండా సబ్సిడీ లేదా ఛార్జీల మినహాయింపునకు ప్రతిపాదన చేస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. డిస్కంల స్టోర్ల ద్వారా నాణ్యమైన ఏబీ కేబుల్స్‌ను సరఫరా చేయాలని సూచించారు. విద్యుత్, ఉద్యాన శాఖల సమన్వయంతో తెలంగాణ వ్యాప్తంగా విద్యుత్ లైన్లను గుర్తిస్తున్నామని తెలిపారు. దీనివల్ల ఆయిల్‌పామ్ రైతులకు అదనపు ఆదాయం వస్తుందని వివరించారు. వ్యవసాయ కార్మికులకు మెరుగైన భద్రతే తమ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

బంగారం కొనుగోళ్లు వాయిదా వేయాలన్న మోదీ సలహాకు వ్యాపార సంఘం కృతజ్ఞతలు.. కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలన్న బీజేపీ

దాదాపు రూ. 65 లక్షల మేర భారీగా తగ్గడంతో ప్రధాని సలహా ఎంతో మేలు చేసిందని సీటీఐ ఆ లేఖలో పేర్కొంది. ఈ ముందస్తు సూచన కారణంగా లక్షలాది మంది నగల వ్యాపారులు, ట్రేడర్లు, ఇన్వెస్టర్లు తీవ్ర నష్టాలను తప్పించుకోగలిగారని వివరించింది. అంతేకాకుండా, ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్‌లో ఈ ధరల తగ్గుదల సాధారణ కుటుంబాలకు పెద్ద ఊరటనిచ్చిందని వ్యాపార వర్గాలు స్పష్టం చేశాయి. సీటీఐ లేఖను ప్రస్తావిస్తూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విలేకరులతో మాట్లాడారు. వ్యాపారులను, సాధారణ పౌరులను తప్పుదోవ పట్టించేలా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకత్వం తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక నిర్వహణ, సాధారణ జీవనశైలితో పోలిస్తే గాంధీ-వాద్రా కుటుంబ జీవన విధానం భిన్నంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వం తీసుకున్న సమయానుకూల నిర్ణయాలు, సూచనలు దేశ ఆర్థిక ప్రయోజనాలకు, సాధారణ పౌరులకు అండగా నిలిచాయని బీజేపీ స్పష్టం చేసింది.

భారతీయ సంప్రదాయాలపై ఏమాత్రం అవగాహన లేదు

వ్యక్తపరచలేకపోతున్నారని చురకలు అంటించారు. గత సోమవారం తన తల్లి సోనియాగాంధీ ఆత్మకథ పుస్తకావిష్కరణలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ విమర్శలు చేయటంతో ఈ వివాదం మొదలైంది. భోజనం చేసేటప్పుడు తన తండ్రి రాజీవ్‌గాంధీ ఒడిలో తల్లి సోనియా కూర్చునేవారని రాహుల్ గుర్తుచేసుకున్నారు. తన స్నేహితుల ఇళ్లకు వెళ్లినప్పుడు వారి తల్లిదండ్రులు అలా కూర్చోకపోవడం చూసి ఆశ్చర్యపోయేవాడినని చెప్పారు. 'అర్ధనారీశ్వర' శిల్పం ఫొటోను షేర్ చేసి అసోం సీఎం హిమంత బిశ్వశర్మ సహా పలువురు బీజేపీ నేతలు చేసిన విమర్శలు రాహుల్ కౌంటర్ ఇచ్చారు.

ఈశాన్య రాష్ట్రాల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాం : అమిత్ షా

గత 12 ఏళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో ఈశాన్య ప్రాంతం కనెక్టివిటీ, అభివృద్ధి పరంగా భారీ మార్పులను చూసిందని అమిత్ షా చెప్పారు. ఈశాన్య ప్రాంతంలోని ఏ రాష్ట్ర రాజధాని కూడా మెరుగైన రోడ్డు, రైలు, వాయు రవాణా సౌకర్యాలు లేకుండా లేదని పేర్కొన్నారు. ఈశాన్య ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పన అపూర్వంగా విస్తరించిందని అన్నారు. కేంద్రం తన అభివృద్ధి అజెండాలో ఈశాన్య ప్రాంతానికి అగ్రస్థానం ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. విద్య, ఆర్థిక వృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని స్పష్టం చేశారు. ఈ ప్రాంత సహజ వనరులు, పర్యాటక సామర్థ్యాన్ని సక్రమంగా వినియోగించుకుంటే దేశ నిర్మాణంలో అవి కీలక పాత్ర పోషించగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. "అరుణాచల్ గ్రామాల్లోని సహకార సంఘాల నుంచి ఉత్పత్తులను సేకరించాలని హోం మంత్రిత్వ శాఖ ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ), సైన్యాన్ని ఆదేశించింది. దీంతో ఈ గ్రామాలకు, సాయుధ దళాలకు మధ్య బంధం బలపడింది. అరుణాచల్‌లోని మహిళలు తమ సహకార సంఘాల ద్వారా పాల ఉత్పత్తులు, గుడ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు, పిండిని సరఫరా చేస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహాయం అందిస్తుంది. రాష్ట్రంలో ఉపాధి, విద్య, ఆరోగ్య సంరక్షణ, ప్రతి కుటుంబ శ్రేయస్సే తమ ప్రభుత్వానికి కీలక ప్రాధాన్యత అంశాలు."

ఆ మార్గాలను కనుక్కోవాల్సిందే : కిరణ్ రిజిజు

అరుణాచల్ ప్రదేశ్ ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే మార్గాలను కనుగొనాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పిలుపునిచ్చారు. అలాగే ప్రజల గుర్తింపు, భూ హక్కులు, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూనే, రాష్ట్రం పెట్టుబడులు, సాంకేతికత, ఆధునిక సౌకర్యాలను ఎలా ఆకర్షించగలదనే దానిపై విస్తృత చర్చ జరగాలని అన్నారు. అరుణాచల్ ప్రదేశ్ ఒక ప్రత్యేక రాష్ట్రమని, దాని గిరిజన స్వభావం, పరిమిత వనరులు, భూ యాజమాన్యంపై ఉన్న ఆంక్షల కారణంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని తెలిపారు.

సిద్ధిపేట 'సదర్'లో హరీశ్ రావు జోష్..

ఈ సందర్భంగా జరిగిన ఊరేగింపులో హరీశ్ రావు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తలపాగా ధరించి, చేతిలో హాకీ బ్యాట్ పట్టుకుని పైకెత్తుతూ యువతతో కలిసి జోష్ ప్రదర్శించారు. తనకు బహూకరించిన కత్తిని గాల్లోకి దూశారు. సిద్ధిపేటలో జరిగిన ఈ సదర్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని, సంతృప్తిని ఇచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఉత్సవాల అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన పలు సర్వేలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో సిద్ధిపేట రాజకీయాల ప్రస్తావన రావడంతో వేదికపై సవాళ్లు, ప్రతిసవాళ్లు చోటుచేసుకున్నాయి. స్థానిక అభివృద్ధిపై ఎవరైనా చర్చకు రావచ్చంటూ నాయకులు ఒకరికొకరు సవాళ్లు విసురుకోవడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఏదేమైనా, సంప్రదాయ ఉత్సవాలను ప్రజలంతా కలిసికట్టుగా, ఉల్లాసంగా జరుపుకోవడం అభినందనీయమని హరీశ్ రావు పేర్కొన్నారు.

చైనా బార్డర్‌లోని 40 గ్రామాల్లో జనాభా పెరిగింది- వలసలు ఆగిపోయాయ్

మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ పాలనలో అరుణాచల్ ప్రదేశ్‌లో అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. ఆ రాష్ట్రానికి తగినన్ని నిధులు కేటాయించలేదని విమర్శించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ ఈశాన్య రాష్ట్ర పురోగతి కోసం గణనీయంగా నిధులను పెంచిందని పేర్కొన్నారు. అరుణాచల్‌ప్రదేశ్ పర్యటనలో ఉన్న అమిత్ షా ఇటానగర్‌లో జరిగిన సహకార సదస్సులో ఈ మేరకు మాట్లాడారు.



'అభివృద్ధి సరిహద్దుల నుంచే ప్రారంభం కావాలి'

"2004-2014 వరకు యూపీఏ ప్రభుత్వం అరుణాచల్ ప్రదేశ్‌కు రూ. 33,530 కోట్లు మాత్రమే ఇచ్చింది. అదే సమయంలో 2014-2024 వరకు ఎన్‌డీఏ సర్కార్ ఈ ఈశాన్య రాష్ట్రానికి చేసిన ఆర్థిక సహాయం రూ. 1,64,664 కోట్లకు పెరిగింది. రాష్ట్రానికి అందే పన్ను వాటా నాలుగు రెట్లు, గ్రాంట్లు 18 రెట్లు పెరిగాయి. ఈ గణాంకాలు అరుణాచల్ ప్రదేశ్, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి పట్ల మోదీ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయి. అరుణాచల్ బడ్జెట్ రూ.12,000 కోట్ల నుంచి రూ. 36,000 కోట్లకు పెరగడం గత 12 ఏళ్లలో అభివృద్ధి ఏ స్థాయిలో విస్తరించిందో తెలియజేస్తుంది. సరిహద్దు గ్రామాలను దేశ చివరి గ్రామాలు అని కాకుండా దేశ మొదటి గ్రామాలుగా అభివర్ణించడం ద్వారా ప్రధాని మోదీ ఆ ఊర్ల పట్ల ఉన్న దృక్పథాన్ని మార్చారు. అభివృద్ధి సరిహద్దుల నుంచే ప్రారంభం కావాలి. అక్కడ నివసించే ప్రజలకు అన్ని ప్రాథమిక సౌకర్యాలు, జీవనోపాధి అవకాశాలు లభించాలి. 'వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్' వలసలను తిప్పికొట్టడంలో సహాయపడింది. సరిహద్దులోని దాదాపు 40 గ్రామాలకు ప్రజలు తిరిగి రావడంతో అక్కడ జనాభా పెరిగింది." అని అమిత్ షా పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో పంతాలకు పోవద్దు: సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

మొదటి పేజి తరువాయి

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం చేపట్టిన రెండున్నరేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన స్పష్టమైన ఆమోదమని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలు కూటమికి సంపూర్ణ మద్దతు ప్రకటించారని, ఈ ఏకపక్ష ప్రజాభిప్రాయాన్ని ప్రతిపక్ష వైసీపీ జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన విమర్శించారు. పార్టీ ప్రతిపాదికన జరిగిన పోరు ముగిసిందని, ఇక గ్రామాల్లో అభివృద్ధి ధ్యేయంగా జరిగే పంచాయతీ ఎన్నికల్లోనూ అదే విజయ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. పంచాయతీలు పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా జరుగుతాయని, కాబట్టి అక్కడ రాజకీయ ఘర్షణలకు తావులేకుండా ఏకగ్రీవాలు జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రామాలు ఏకగ్రీవమైతే ప్రభుత్వం అందించే ప్రత్యేక ఆర్థిక నజరానాలు అభివృద్ధి పనులకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. గతంలో కనీస నజరానా రూ.5 లక్షలుగా ఉంటే దానిని ఇప్పుడు రూ.15 లక్షలకు, గరిష్ఠ నజరానాను రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచిన విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.15 లక్షలు, 5 వేల నుంచి 10 వేల మధ్య జనాభా ఉంటే రూ.25 లక్షలు, 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50 లక్షల ప్రోత్సాహకం అందుతుందని ఆయన గుర్తుచేశారు. గ్రామ స్థాయిలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు తీవ్ర పట్టుదలతో ఉంటారని, అటువంటి చోట్ల నేతలతో సంప్రదింపులు జరపాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. నాయకుల మధ్య పంతాలు, వ్యక్తిగత పట్టింపులకు తావులేకుండా ఐకమత్యను ప్రదర్శించాలని సూచించారు. జడ్పీ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రత్యర్థి పార్టీ పోటీ చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని పేర్కొన్న సీఎం, అదే సమయంలో తమ పార్టీలోని నేతలే రెండు వర్గాలుగా విడిపోయి పోటీపడే పరిస్థితి రాకుండా



చూసుకోవాలని హెచ్చరించారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు స్థానిక నాయకులను సమన్వయం చేసుకుంటూ, గ్రామాల సమగ్ర వికాసానికి ఏకగ్రీవాలే మార్గమని ప్రజలను ఒప్పించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

ఏపీలో మూడు కొత్త రైల్వే లైన్లు.. శ్రీశైలం, ఏజెన్సీ ప్రాంతాలకు రైలు మార్గం!

మొదటి పేజి తరువాయి

ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన మద్దతు తెలుపుతూ రైల్వే శాఖకు లేఖలు రాసింది. ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే, ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్), సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

గిరిజన ప్రాంతాలకు, మూడు రాష్ట్రాలకు ప్రయోజనం

సామర్లకోట నుంచి జగ్గంపేట, రంపచోడవరం, మారేడుమిల్లి మీదుగా చింతూరు వరకు సుమారు 150 కిలోమీటర్ల మేర కొత్త లైన్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ మార్గం పూర్తయితే ఇప్పటివరకు రైలు సౌకర్యం లేని ఏజెన్సీ ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. ఇప్పటికే ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి చింతూరు మీదుగా తెలంగాణలోని భద్రాచలం వరకు 173 కిలోమీటర్ల లైన్‌కు ఆమోదం లభించింది. ఈ రెండు మార్గాలు అనుసంధానమైతే ఏపీ, ఒడిశా, తెలంగాణ మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి. ముఖ్యంగా



ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కాకినాడ పోర్టుకు బొగ్గు, ఇనుప ఖనిజం రవాణా సులభతరం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

శ్రీశైలానికి ప్రత్యక్ష రైలు మార్గం

మరో కీలక ప్రతిపాదన మార్కాపురం నుంచి శ్రీశైలం మీదుగా సికింద్రాబాద్ వరకు సుమారు 290 కిలోమీటర్ల రైల్వే లైన్. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీశైలానికి ప్రస్తుతం నేరుగా రైలు సౌకర్యం లేదు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే తెలంగాణ, ఉత్తరాది రాష్ట్రాల నుంచి సికింద్రాబాద్ మీదుగా, ఏపీ, దక్షిణాది రాష్ట్రాల నుంచి మార్కాపురం మీదుగా భక్తులు నేరుగా రైలులో శ్రీశైలం చేరుకోవచ్చు. ఇది పర్యాటక, వాణిజ్య రంగాలకు ఊతమిస్తుంది.

కోస్తా, రాయలసీమ మధ్య తగ్గునున్న దూరం

రాజంపేట నుంచి నెల్లూరు వరకు 120 కిలోమీటర్ల మేర మరో కొత్త రైలు మార్గాన్ని ప్రతిపాదించారు. ప్రస్తుతం రాజంపేట నుంచి నెల్లూరు వెళ్లాలంటే రేణిగుంట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఈ కొత్త లైన్‌తో ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులకు సరకు రవాణా కూడా సులభతరం అవుతుంది. ఈ మూడు ప్రతిపాదనలు ప్రస్తుతం రైల్వే బోర్డు పరిశీలనలో ఉన్నాయి. వీటికి అనుమతులు లభించి, నిధులు మంజూరైతే రాష్ట్రంలో రైల్వే రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు రావడం ఖాయం.

జర్మనీలో నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంత గౌరవిస్తారో నాకు తెలుసు

మొదటి పేజి తరువాయి

సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం దక్కాలని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టుకు లోకేశ్ స్పందిస్తూ, ఈ ముఖ్యమైన విషయాన్ని లేవనెత్తినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శకంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన ఫ్యాక్టరీ వర్క్‌ఫోర్స్‌కు ఉద్యోగావకాశాలు, ప్రాధాన్యత భారీగా పెరుగుతాయని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. "నేను యువకుడిగా ఉన్నప్పుడు జర్మనీలోని ఆటోమొబైల్ ఫ్యాక్టరీలలో ఇంటర్న్‌షిప్ చేశాను. అక్కడ నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంతగా గౌరవిస్తారో నేను స్వయంగా చూశాను. ఆ నైపుణ్యాలకు ఇచ్చే గౌరవమే జర్మనీ ప్రపంచంలోనే అత్యుత్తమ తయారీ రంగ కేంద్రంగా ఎదగడానికి ప్రధాన కారణమైంది. మన దేశంలో కూడా ఐటీఐలపై ఉన్న చిన్నచూపును తొలగించి, నైపుణ్యంతో కూడిన పనులపై గౌరవమర్యాదలు తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని లోకేశ్ వివరించారు. రాబోయే రోజుల్లో తయారీ, పారిశ్రామిక రంగాలలో సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం గణనీయంగా పెరుగుతుందని ఆయన తెలిపారు. సాధారణ విద్యా కోర్సులతో సమానంగా వృత్తి విద్యా కోర్సులకు కూడా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఐటీఐ విద్యార్థుల పట్ల సమాజంలో సానుకూల దృక్పథం ఏర్పడినప్పుడే వారిలో ఆత్మవిశ్వాసం



పెరుగుతుందని, తమ వృత్తి పట్ల వారు మరింత గర్వపడే వాతావరణం ఏర్పడుతుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం.. కొత్త మార్గదర్శకాలు, ?

మొదటి పేజి తరువాయి

దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ బీమాకు సంబంధించిన పూర్తి ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించనుంది. కుల, మత, ఆదాయ భేదాలు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఒక కోటి నుండి 1.15 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రణాళికా విభాగం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం, రేషన్ కార్డు సంఖ్యనే దరఖాస్తు సంఖ్యగా పరిగణిస్తారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ప్రాధాన్యతనిస్తూ, 18 నుండి 59 ఏళ్ల మధ్య వయసున్న వారు మాత్రమే దరఖాస్తు



చేసుకోవడానికి అర్హులు. వయసు నిర్ధారణ కోసం ఆధార్ కార్డులోని పుట్టిన తేదీనే ప్రామాణికంగా తీసుకుంటారు. ఆధార్ వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే, దరఖాస్తు ప్రక్రియకు ముందే వాటిని సరిచేయించుకోవాలని అధికారులు సూచించారు. నమోదు ప్రక్రియ నవంబర్ 19న ప్రారంభమై డిసెంబర్ 18 వరకు కొనసాగనుంది. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ స్థాయిలో, పట్టణాల్లో వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో ఈ శిబిరాలకు హాజరు కావాలి. బీమా పొందే వ్యక్తి ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా పేర్కొనవచ్చు. వృద్ధులు, దివ్యాంగులు శిబిరాలకు రాలేని పక్షంలో, వారి ఇంటి వద్దకే వెళ్లి నమోదు చేసేలా ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. జిల్లా యంత్రాంగాలు, స్థానిక అధికారులు ఈ పథకం అమలును నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

74వేల పేజీల ఛార్జ్ షీట్ లో 8మంది పేర్లే ఎందుకు?'- అయోధ్య విరాళాల చోరీపై కాంగ్రెస్ సూటి ప్రశ్నలు

అయోధ్య రామమందిరంలో భక్తులు సమర్పించిన విరాళాలు, విలువైన వస్తువుల చోరీ కేసులో దాఖలైన ఛార్జ్‌షీట్‌పై కాంగ్రెస్ పార్టీ పలు ప్రశ్నలు లేవనెత్తింది.

ఢిల్లీ: అయోధ్య రామమందిరం విరాళాల చోరీ కేసులో పోలీసులు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌పై కాంగ్రెస్ పార్టీ పలు సందేహాలు వ్యక్తం చేసింది. 74 వేల పేజీల ఛార్జ్‌షీట్‌లో కేవలం ఎనిమిది మంది ఉద్యోగులను మాత్రమే నిందితులుగా చేర్చడం వెనుక ఉద్దేశమేంటని ప్రశ్నించింది. ట్రస్ట్‌లోని కీలక వ్యక్తుల పాత్రను పక్కనపెట్టి వారిని కాపాడే ప్రయత్నం జరుగుతోందా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ నిలదీశారు. కేసులో ఎవరినీ బాధ్యత నుంచి తప్పించకూడదని స్పష్టం చేశారు. రామమందిరం కోట్లాది మంది భారతీయుల విశ్వాసానికి ప్రతీక అని, శ్రీరాముడి పేరుతో భక్తులు సమర్పించిన ప్రతి రూపాయికి లెక్క ఉండాలని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన పలు ప్రశ్నలు సంధించారు. 'చందా చోరీ, ఆస్తికీ ద్రోహం' అంటూ ఛార్జ్‌షీట్‌లోని అంశాలను ప్రస్తావించారు.

'వీడియో అందినా ఎఫ్ఐఆర్ ఎందుకు ఆలస్యం?'

ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం, 2026 జూన్ 4న రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు వాట్సాప్ ద్వారా చోరీకి సంబంధించిన వీడియో అందింది. ఓ బాత్‌రూమ్‌లో రూ. 2.25 లక్షల నగదు కట్టలు ఉన్నట్లు ఆ వీడియోలో కనిపించిందని జైరాం రమేశ్ తెలిపారు. ఇలాంటి చోరీలు కొన్ని రోజులుగా జరుగుతున్నాయని పేర్కొన్నట్లు వివరించారు. జూన్ 5న చంపత్ రాయ్ నివాసంలో అనిల్ మిశ్రా, గోపాల్ జీ, నరేంద్ర జీ ఆ వీడియోను ల్యాప్‌టాప్‌లో చూశారని ఛార్జ్‌షీట్‌ను ఉటంకిస్తూ చెప్పారు. అంటే చోరీకి సంబంధించిన సమాచారం, ఆధారాలు ట్రస్ట్ ఉన్నతాధికారుల వద్దకు ముందుగానే చేరాయని అన్నారు. అయితే జూన్ 25 వరకు ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వీడియో అందిన తర్వాత 21 రోజుల పాటు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడానికి కారణమేంటని నిలదీశారు. ఆ ఆలస్యానికి బాధ్యులెవరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో జరిగిన పరిణామాలను కూడా జైరాం రమేశ్ వివరించారు. జూన్ 13న ర

రాప్తాడు తరహాలోనే అనంతపురం మేయర్ ఎన్నికల్లోనూ దొంగ ఓట్ల కుట్ర

అనంతపురం, నవంబర్ 22, దరువు న్యూస్ న్యూస్ : రాప్తాడు తరహాలోనే అనంతపురం మేయర్ ఎన్నికల్లోనూ దొంగ ఓట్ల కుట్ర జరిగిందని కార్పొరేషన్ డైరెక్టర్లు, కూటమి కార్పొరేటర్లు, నాయకులు ఆరోపించారు. అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పిఎల్ఎన్ మూర్తి, కడియాల కొండన్న, పరమేశ్వర్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డిలు మీడియాతో మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గం ప్రసన్నాయపల్లిలోని ఓ మీసేవా కేంద్రంలో నకిలీ ఆధార్ కార్డులు, ఓటరు స్లిప్పులు తయారు చేస్తూ దొంగ ఓట్లకు వైసీపీ నేతలు పన్నిన కుట్ర వెలుగులోకి వచ్చిందన్నారు. తాజాగా పోలీసుల దాడుల్లో ఇది బట్టబయలైన నేపథ్యంలో.. సరిగ్గా ఇదే తరహా అక్రమాలు మొన్నటి అనంతపురం మేయర్ ఎన్నికల్లోనూ జరిగాయని కూటమి నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. అనంతపురం మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం స్థానాల్లో కూటమి అభ్యర్థులు 41చోట్ల ఘనవిజయం సాధిస్తే, వైసీపీ కేవలం 21 స్థానాలకే పరిమితమైందని నేతలు గుర్తుచేశారు. మెజారిటీ కార్పొరేటర్ స్థానాలను కూటమి గెలుచుకున్నప్పుడు, మేయర్ సీటును వైసీపీ అభ్యర్థి ఎలా గెలుచుకున్నారని ప్రశ్నించారు. ప్రచార సమయంలో వైసీపీ నాయకులు కేవలం ఆధార్ కార్డు మాత్రమే తీసుకురండి అని పదేపదే చెప్పడం వెనుక ఉన్న అసలు కుట్ర, రాప్తాడులో వేల సంఖ్యలో నకిలీ ఆధార్ కార్డులు దొరకడంతో ఇప్పుడు స్పష్టమైందన్నారు. మేయర్ ఎన్నికల కౌంటింగ్ సమయంలో రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) ఏకపక్షంగా వ్యవహరించారని నేతలు ఆరోపించారు. కౌంటింగ్ హాల్‌లో నాలుగు టేబుళ్ల వద్ద బీజేపీ, కూటమి ఏజెంట్లు లేకుండానే కౌంటింగ్ నిర్వహించారని, దీనిపై తమకు తీవ్ర అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఈ అక్రమాలపై ఇప్పటికే బీజేపీ మేయర్ అభ్యర్థి కె. అజేష్ బాబు జిల్లా కోర్టును ఆశ్రయించారని, రాప్తాడు తరహాలో జరిగిన ఈ దొంగ ఓట్ల వ్యవహారంపై ఎన్నికల అధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు భారీ విజయాన్ని అందించిన ప్రజలకు నేతలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసే ప్రజలు ఈ తీర్పునిచ్చారని అన్నారు. ఈవీఎంలైనా, బ్యాలెట్ పేపర్లయినా విజయం



కూటమిదేనని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి దౌర్జన్యపూరిత వాతావరణాన్ని సృష్టించాలని చూశారని నేతలు విమర్శించారు. చొక్కాలు మడతపెట్టండి, రప్పా రప్పా అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టి అల్లర్ల ద్వారా ఎన్నికలను అడ్డుకోవాలని కుట్రలు పన్నారని ఆరోపించారు. అయితే, ప్రజలు అవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా కూటమికి మద్దతు పలికారన్నారు. రానున్న సర్పంచ్ ఎన్నికల్లోనూ కూటమి మద్దతుదారులు భారీ ఎత్తున బరిలో నిలిచారని, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రజలందరూ కూటమి బలపరిచిన అభ్యర్థులనే ఆదరించి గెలిపించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఆశ్రమంలో విద్యార్థులకు అన్నదానం



అనంతపురం, నవంబర్ 22 దరువు న్యూస్ న్యూస్ : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్నదానం చేశారు. కోవూరు నగర్‌లో ఉన్న ఎయిమ్ ఫర్ సేవ, స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో ట్రస్టు సభ్యులు కల్లమడి రవీంద్రనాథ్, రమాదేవి దంపతుల పెళ్లి రోజు పురస్కరించుకొని విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. ఆశ్రమాల్లోనూ ఇతర ప్రాంతాల్లోనూ ఉన్న నిస్సహాయులు, అనాధలు వారు తమకు ఎవరూ లేరనే ఆలోచనను వీడి సంతోషంగా తమతోనే అందరూ ఉన్నారని భావించాలన్నారు. ఆ దేవుడి ఆశీస్సులు అందరిపై ఉండి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్తీక మాసంలో ఏ చిన్న పని చేసినా.. పుణ్యం వస్తుందన్నారు. బాధ్యతగా వీలున్న కొంతమంది అవసరంలోనూ, ఆపదలో ఉన్నవారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో స్వామి సత్యాత్మానంద, మేనేజర్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

రెవా యూనివర్సిటీ కాన్వొకేషన్‌లో డిగ్రీ పట్టా అందుకున్న కోటేగంటి అమీర్ భాష

యాడికి దరువు న్యూస్ ప్రతినిధి నవంబర్(22) : తల్లిదండ్రుల కృషికి, కుమారుడి పట్టుదలకు దక్కిన గౌరవం.. కుటుంబ సభ్యుల్లో ఆనందోత్సాహం తాడపత్రి అనంతపురం జిల్లా తాడపత్రి పట్టణానికి చెందిన సమాచార హక్కు జిల్లా పూర్వ ఉపాధ్యక్షులు, దూదేకుల సేవా సంఘం గౌరవ అధ్యక్షులు కోటేగంటి నబీ రసూల్ గారి తనయుడు కోటేగంటి అమీర్ భాష బెంగళూరులోని రెవా యూనివర్సిటీ 11వ కాన్వొకేషన్ వేడుకల్లో డిగ్రీ పట్టా అందుకున్నారు. 2026 బ్యాచ్ కాన్వొకేషన్ వేడుకల్లో అమీర్ భాష డిగ్రీ పట్టా అందుకోవడం కుటుంబ సభ్యులకు ఆనందాన్ని, గర్వాన్ని కలిగించింది. విద్యాభ్యాసంలో కుమారుడు సాధించిన ఈ విజయం తల్లిదండ్రుల కృషికి, విద్యార్థి పట్టుదలకు ప్రతిఫలంగా నిలిచింది. తమ పిల్లలు విద్యలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని తల్లిదండ్రులు పడే శ్రమ, అందించే ప్రోత్సాహం ఇలాంటి విజయాల రూపంలో సార్థకమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అమీర్ భాష సాధించిన ఈ విజయంపై బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేస్తున్నారు.



అమీర్ భాష భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి, కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు. కోటేగంటి అమీర్ భాషకు హృదయపూర్వక అభినందనలు!

జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికైన గంజే నాగరాజుకు ఏటీపీఎఫ్ 1938 అభినందనలు



అనంతపురం, నవంబర్ 22, దరువు న్యూస్ న్యూస్ : అనంతపురం జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గంజే నాగరాజును ఏటీపీఎఫ్ 1938 అనంతపురం జిల్లా శాఖ పక్షాన మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గంజే నాగరాజుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. జిల్లా అభివృద్ధితో పాటు విద్యారంగం, ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఫెడరేషన్ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, జిల్లా అధ్యక్షుడు జి.రవీంద్ర, గౌరవ అధ్యక్షులు అశోక్ నాయక్, ప్రధాన కార్యదర్శి బి.హనుమప్ప, ఐఫియా జాతీయ కౌన్సిలర్ వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యులు సాకే భాస్కర్, రాష్ట్ర కౌన్సిలర్ గోవర్ధన నాయుడు, జిల్లా కార్యదర్శులు ఫక్రుద్దీన్, హనుమంతు, నగర శాఖ అధ్యక్షుడు నారాయణ నాయక్, విడపనకల్ మండల ప్రధాన కార్యదర్శి కిషోర్, బి.కే.ఎస్ మండల నాయకులు సమీముల్లా, ఫెడరేషన్ మిత్రులు రామచంద్ర, గోపాల్ ఫెడరేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

దళితుడిపై కులం పేరుతో దాడి అమానుషం

అనంతపురం, నవంబర్ 22 (దరువు న్యూస్): అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి గ్రామంలో దళిత యువకుడు నాగేష్‌పై కులం పేరుతో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. శివుని మాల ధరించి ఆలయంలోకి ప్రవేశించాడనే కారణంతో బోయ సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు నాగేష్‌ను కులం పేరుతో దూషిస్తూ దాడి చేయడం అమానవీయమని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, కులం, మతం పేరుతో ఆలయ ప్రవేశాన్ని అడ్డుకోవడం, అవమానించడం, దాడులకు పాల్పడటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. నేటికీ దళితులు ఆలయ ప్రవేశం కోసం పోరాడాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ ఘటనపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బాధితుడి ఫిర్యాదు మేరకు



ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేయాలని, ఘటనకు బాధ్యులైన వారిని చట్టప్రకారం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడు నాగేష్‌కు తగిన రక్షణ కల్పించడంతో పాటు గ్రామంలో కులవివక్ష ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు

సిఎస్ఐ చర్చిలో మేయర్ రమేష్ గౌడ్ ప్రత్యేక ప్రార్థనలు



అనంతపురం, నవంబర్ 22, దరువు న్యూస్ న్యూస్ : అనంతపురం నగరంలోని అరవింద్ నగర్‌లో ఉన్న సి.ఎస్.ఐ చర్చిలో ఆదివారం నగర మేయర్ రమేష్ గౌడ్, 37వ డివిజన్ కార్పొరేటర్ బలరాం రావుతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చర్చిలో పాల్గొని, ప్రార్థనలలో చేరి దైవ ఆశీస్సులు పొందారు. చర్చి ప్రార్థనలలో పాల్గొన్న భక్తులు, స్థానిక ప్రజలు వారిని ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. అన్ని మతాల ప్రజల సమగ్ర అభివృద్ధి, సమాజంలో సామరస్యం నెలకొనేలా ప్రభుత్వం తన వంతు కృషి చేస్తుందని తెలిపారు. ప్రజల సమస్యలను దగ్గరగా గమనించి, పరిష్కారాల కోసం నిరంతరం పనిచేస్తానని అన్నారు. అనంతరం 37వ డివిజన్ కార్పొరేటర్ బలరాం రావు మాట్లాడుతూ.. తమ డివిజన్‌లోని మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. చర్చి సంఘం నాయకులు, భక్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బెంహర్ బాబు, సెక్రటరీ జాన్ చంద్రశేఖర్, ట్రెజరర్ ఇమ్మానుయేల్, చర్చి మెంబెర్స్ జాన్ సుధీర్, సురేష్ పాల్, సునీల్, పద్మాకరబాబు, భాస్కర్, ఏఐసీసీ స్టేట్ సెక్రటరీ కాంతి జాన్ వెసలెయ్, ఏఐసీఫ్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ డా.విల్సన్, వైస్సార్సీపీ నాయకులు అమర్నాథ్ రెడ్డి, విక్టర్, సతీష్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆర్ఈఎఫ్ సర్వసభ్య సమావేశం

అనంతపురం. నవంబర్ 22 దరువు న్యూస్ : స్థానిక ఉపాధ్యాయ భవనందు రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నలగొండ రామకృష్ణ అధ్యక్షతన స్థానిక ఉపాధ్యాయ భవనం నందు ఆర్ ఈ ఎఫ్ సర్వసభ్య సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఉద్యోగులు దీర్ఘకాలికంగా ఎదుర్కొన్న సమస్యలపై చర్చించడం జరిగింది ఇప్పటివరకు ఉన్న కమిటీలను రద్దుచేసి కొత్త కమిటీలను డిసెంబర్ మొదటి వారంలో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నుకోవడం జరుగుతుంది అజెండాలోని అన్ని తీర్మానాలు చర్చించి ఆమోదించడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్ రామచంద్ర రాయలసీమ



అధ్యక్షుడు దాసరి ఆదినారాయణ జిల్లా అధ్యక్షుడు హెచ్ ముత్యాలరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ ఆర్ ఇ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమా శంకర్ ఆర్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు. జీవి ఉజ్వల్.ఆర్ ఈ ఎఫ్ జిల్లా కార్యదర్శి తిప్పేస్వామి, ఉద్యోగుల హరి, నరసింహ మూర్తి, వినయ్ వీరేష్ కుమార్ ఎస్సీ ఎస్టీ



గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్. బీసీ. ఓబిసి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిడుగు శ్రీనివాసులు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హంపావతి గోవిందు సెరికల్చర్ డిపార్ట్మెంట్ ఉద్యోగి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు

శబరిమల పాదయాత్ర భక్తులకు ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నదానం

- 80ఫీట్ రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో కార్యక్రమం
- భక్తులకు స్వయంగా భోజనం వడ్డించిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- హైదరాబాద్ నుంచి శబరిమలకు పాదయాత్ర చేస్తున్న అయ్యప్ప భక్తులు

అనంతపురం, నవంబర్ 22, దరువు న్యూస్ న్యూస్ : సువర్ణభూమి ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప స్వామి భక్తులకు





అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం నగరంలోని శ్రీనగర్ 80 అడుగుల రోడ్డులో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ నుంచి సుదూర ప్రాంతమైన శబరిమలకు కఠిన నియమాలతో పాదయాత్ర చేపట్టిన సువర్ణభూమి బృందం అయ్యప్ప స్వాములను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అంత దూరం పాదయాత్రగా వెళ్లడం సామాన్యమైన విషయం కాదని, ఆ అయ్యప్ప స్వామి కృపాకటాక్షాల వల్లే ఇది సాధ్యమవుతుందని కొనియాడారు. అనంతరం పాదయాత్ర బృందంతో పాటు ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు. పాదయాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా సాగాలని, స్వామివారి దర్శనం దిగ్విజయంగా జరగాలని ఆకాంక్షిస్తూ భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తుల శరణుఘోషతో ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సువర్ణభూమి పాదయాత్ర బృందం ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి

యాడికి దరువు న్యూస్ ప్రతినిధి నవంబర్(22) : యాడికి మండలంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా జరగాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాల్యం నారాయణస్వామి సిపిఐ నాయకులతో కలిసి డిమాండ్ చేశారు.ఆదివారం యాడికి మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్యం నారాయణస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో నామినేషన్ల ప్రక్రియలో తమ అభ్యర్థులకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. ప్రతి పార్టీ మద్దతుదారుల అభ్యర్థులకు, స్వతంత్ర అభ్యర్థులకు నామినేషన్ వేసేందుకు సమాన అవకాశం కల్పించాలని, ఎన్నికల అధికారులు నిబంధనల మేరకు వ్యవహరించాలని కోరారు.ఎన్నికల్లో డబ్బు, అధికార దుర్వినియోగం, బెదిరింపులకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్లు నిర్భయంగా ఓటు వేసే వాతావరణం కల్పించాలని అధికారులను కోరారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే తమ లక్ష్యమని, ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేశవరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు వి.కె. ప్రదీప్ రెడ్డి, అజయ్ బాబు, యాడికి మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ,



పెద్దవడుగూరు మండల కార్యదర్శి వెంకట రాముడు యాదవ్, సిపిఐ సీనియర్ నాయకులు శ్రీరాములు, ఓబిరెడ్డి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వడ్డే రాముడు, సిపిఐ నాయకులు సాంబశివుడు, సెట్ రంగారెడ్డి, కుల్లాయి రెడ్డి, సిపిఐ మండల నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ పూర్తయిన అనంతరం చిన్నపాటి గొడవ కాస్త పెద్దదిగా మారింది మాట మాట పెరగడంతో ఒకరిపై ఒకరు రాళ్లురువ్వుకొని దాడి చేసుకున్నారు సమాచారం అందుకున్న యాడికి పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి భారీగా చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు అయితే ఇరు వర్గాలకు చెందిన కార్యకర్తలకు భారీగా గాయాలు అవ్వడంతో గాయాలైన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏ క్షణాన ఏం సంభవిస్తుందో అని పుప్పాల గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు యాడికి పోలీసులు అవగాహన కార్యక్రమాలు ఎన్నో చేసి ఎక్కడ ఘర్షణలకు దిగకుండా వ్యక్తిగత దాడులకు పాల్పడకుండా ప్రతి ఒక్కరు పోలీసులతో సహకరించాలని ఎన్నో మార్లు చెప్పినా కూడా మారని రీతిలో ప్రజలు ఉన్నారు.

పుప్పాల గ్రామం ఇరువర్గాల ఘర్షణ



యాడికి దరువు న్యూస్ ప్రతినిధి నవంబర్(22): యాడికి మండలంలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ మండలంలో మొదటిరోజు ప్రశాంతంగా కొనసాగింది రాయల్ చెరువు పుప్పాల పుట్రాళ్లపల్లి మూడు పంచాయతీలకు గాను రాయల్ చెరువు సచివాలయంలో నామినేషన్ ప్రక్రియ ఏర్పాటు చేశారు ఆదివారం రెండవ రోజు పుప్పాల గ్రామం టిడిపి వైసిపి ఇరువర్గాలు నామినేషన్ వేశారు

సంపాదకీయం

'ఇండియా'కు దారి చూపిన ఓట్ చోరీ

ఓట్ చోరీకి వ్యతిరేకంగా వెల్లువెత్తిన నిరసనలతో సర్ ప్రక్రియ పట్ల సుప్రీంకోర్టు దృక్పథం మారింది. 13.30 కోట్ల మంది పౌరులు ఓటుహక్కు కోల్పోయేందుకు కారణమైన ఆ సవరణ ప్రక్రియలోని విధి విధానాలు కొన్నిటిని రద్దు చేసేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సైతం నిర్ణయించి, బిద్దుబాటు చర్యలూ చేపట్టింది. నియమం ప్రకారం అయితే ఓటర్ల సంఖ్య వయోజన జనాభాకు ఇంచుమించు సరిసమానంగా ఉండి తీరాలి. మరి సర్ ప్రక్రియ అమలుపూర్తయిన అనంతరం ప్రతి రాష్ట్రంలోను వయోజన జనాభా ఓటర్ల నిష్పత్తి ఎలా ఉండనున్నది? ఆ నిష్పత్తి 100 శాతానికి చేరువలో ఉన్నట్టయితే తుది జాబితాలు లోపరహితమైనవని విశ్వసించవచ్చు. లేనిపక్షంలో అవి లోపభూయిష్ఠమైనవి అనేందుకు సంకోచించనవసరం లేదు. ఓటర్ జాబితాల నుంచి తొలగింపునకు గురైన ఓటర్లలో (మృతులు మినహా) అత్యధికుల పేర్లు మళ్లీ జాబితాలలో చేరనున్నాయి. తమ సిబ్బంది ఇంటింటికి వెళ్లి, తప్పులు జరిగి ఉంటే వాటిని సరిదిద్దుతారని, ఈసీఐ ఇచ్చిన హామీ ద్వారా సర్ తుది జాబితాలు సక్రమంగా ఉండేందుకు అవకాశమున్నదనే నమ్మకం కలుగుతోంది. మంచిదే. అయినా, సర్ రాజ్యాంగవిహితంగా అమలవుతున్నదని మొదటినుంచీ వాదించిన ఈసీఐ ఇప్పుడు ఈ చర్యలు ఎందుకు తీసుకుంటున్నట్టు? తన తప్పులకు ప్రాయశ్చితం చేసుకుంటోందా? లేక, సర్‌లో అన్యాయం కొనసాగితే ప్రజలు మరింతగా ఆగ్రహ భార్గవులు అవుతారని భయపడిందా? ఏమైనా కావచ్చు కానీ ఒకటి మాత్రం స్పష్టం: తొలగింపులకు గురైన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలలో చేర్చడం వల్ల ఓట్ చోరీ వ్యతిరేక ఉద్యమం 2029 నాటికి తన ప్రభావశీలతను పూర్తిగా కోల్పోవడం ఖాయమని భారతీయ జనతా పార్టీ విశ్వసిస్తున్నది. 2024 సార్వత్రక ఎన్నికల సందర్భంలో 'భారత రాజ్యాంగం ప్రమాదంలో పడింది' అన్న అంశం ప్రజలను అమితంగా కలవరపరిచింది. స్వాతంత్ర్య నిర్మాతలు, గణతంత్ర రాజ్యాంగ వ్యవస్థాపకుల ఆశయాలు, అభీష్టాలు వమ్మయిపోతున్నాయనే భావన ప్రజల మనసుల్లో నెలకొన్నది. దీనికితోడు అవధులు లేని అవినీతి, అదుపు లేని ధరల పెరుగుదల, పెచ్చరిల్లిన నిరుద్యోగం, గ్రామీణ శ్రామిక, పట్టణ కార్మిక జనావళికి ఎదుగూ బొదుగూ లేని వేతనాలు, వ్యవసాయ ఆదాయాలు తగ్గిపోవడం, రోడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కొరవడడం, సమాజ జీవితంలో సర్వత్రా నేరపూరిత కార్యకలాపాలు పెరిగిపోవడం మొదలైనవి అన్ని రాష్ట్రాల ప్రజలనూ వేధించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వ ప్రతిష్ఠ మసకబారింది. అయితే ప్రజల అసంతృప్తి, ఆగ్రహం ఆ ప్రభుత్వాన్ని అధికారం నుంచి తొలగించలేకపోయాయి. ఎన్నికల పూర్వ, అనంతర పాత్తులతో ఎన్డీఏ సర్కార్ 293 మంది సభ్యుల మద్దతును కూడగట్టుకున్నది. ప్రతిపక్ష ఇండియా కూటమికి 234 స్థానాలు వచ్చాయి. 'రాజ్యాంగం ప్రమాదంలో పడింది' అన్నది సత్యదూరం కాదు కనుకనే అసంఖ్యాక ప్రజలు ఆ వాస్తవాన్ని విశ్వసించారు. ఆ ఆరోపణతో ఇండియా కూటమి నిర్వహించిన ఉద్యమానికి పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు. అయినప్పటికీ ఎన్నికలలో పరిస్థితులు ఇండియా కూటమికి అనుకూలంగా పరిణమించలేదు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ మళ్లీ అధికారంలోకి రాగలిగింది. ఈ నవంబర్ తొలినాళ్లలో అమెరికా కాంగ్రెస్‌కు జరిగిన మధ్యంతర ఎన్నికలలో కూడా ఇటువంటి పరిణామాలే సంభవించడం గమనార్హం. రిపబ్లికన్ పార్టీ 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) ప్రచారానికి డెమొక్రాట్లు దీటుగా ప్రతిస్పందించారు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రాజ్యాంగ విరుద్ధ పాలనాశైలి అమెరికన్ ఓటర్లను మనస్తాపానికి గురిచేసింది. ట్రంప్ అప్రజాస్వామిక పాలనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసిన అంశాలు రెండు: ఒకటి యుద్ధం, మరొకటి ధరలు అందుబాటులో లేకుండాపోవడం. అత్యధిక ఓటర్లకు ఆహారం, ఇంధన ధరలు, గృహ వసతి వ్యయాలు భరించలేని స్థాయిలో పెరిగిపోయాయి. రోజువారీ జీవితం దుర్భరమైపోవడానికి ట్రంప్ విధానాలే కారణమని అమెరికన్లు విశ్వసించారు. గాజా (పాలస్తీనా)పై ఇజ్రాయెల్ దాడుల్లో వేలాది అమాయక ప్రజలు హతమారిపోవడం, ఆ ప్రాంతం పూర్తిగా విధ్వంసమవడం అమెరికా ఓటర్లను కలవరపరిచింది. ఇజ్రాయెల్‌తో కలిసికట్టుగా ఇరాన్‌పై ట్రంప్ యుద్ధానికి వెళ్లడంవల్లే తమకు కష్టాలు దాపురించాయని వారు గట్టిగా భావించారు. యుద్ధం కారణంగా చమురు రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధి మూతపడడం, అనేక దేశాలకు వ్యతిరేకంగా ట్రంప్ విచక్షణారహితంగా విధించిన సుంకాలతో స్వదేశంలో ధరలు అలవికాని విధంగా పెరిగిపోయాయని, ట్రంప్ పాలన తమకు కష్టనష్టాలనేకానీ కనీస శ్రేయస్సును ఇవ్వడం లేదని అమెరికన్లు నమ్ముతున్నారు. భారత్‌లో కూడా అటువంటి పరిస్థితులే ఉన్నాయి. ఆహార ధరలు పెరిగిపోయాయి. టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణం 12.3శాతంగా ఉండగా, వినియోగదారుల ధరల సూచీ ద్రవ్యోల్బణం ఆర్బీఐ నిర్దేశించిన గరిష్ఠ పరిమితిని దాటి 6.1శాతంగా ఉంది. ఆహార ద్రవ్యోల్బణం 8.9శాతం. ఒక ప్లేటు శాకాహార భోజనం ధర ఐదు సంవత్సరాల క్రితం రూ.30.80 ఉండగా ఈ నవంబర్‌లో రూ.41.90కి చేరింది. వాస్తవ వేతనాలు స్తంభించిపోయాయి. కుటుంబ పొదుపులు తగ్గిపోయి రుణాలు పెరిగిపోయాయి. అధికారిక సమాచారం ప్రకారమే నిరుద్యోగం పట్టణ ప్రాంతాలలో 6.7శాతం, గ్రామీణ ప్రాంతాలలో 4.2శాతం. శాశ్వత ఉద్యోగాలు ఎవరికీ దొరకడం లేదు. ముందున్నది ముసళ్ల పండుగే. ద్రవ్యోల్బణం రేటు, నిరుద్యోగం రేటు మరింతగా పెరగనున్నాయి. ఆర్బీఐ త్వరలోనే రెపో రేటును 5.50శాతం నుంచి 5.75 లేదా 6శాతానికి పెంచే అవకాశమున్నది.

'క్వాడ్'కు కొత్త శక్తి!



రెండేళ్ల విరామం తర్వాత నవంబర్ 17న ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో 'క్వాడ్' కూటమి నాయకుల శిఖరాగ్ర సమావేశం జరిగింది. క్వాడ్ సభ్యదేశాల నేతలైన- ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయె తకాయిచి, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దీనికి హాజరయ్యారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన తొలి సమావేశమిది. దీంతో క్వాడ్‌పై నెలకొన్న కారుమబ్బులు కొన్ని వీడినట్లయింది. క్వాడ్ కూటమిని ట్రంప్ నిర్లక్ష్యం చేస్తున్నారనే అభిప్రాయం ఉండటం వల్లే 2024 నుంచి శిఖరాగ్ర సమావేశాలు జరగలేదు. వాస్తవానికి నిరుడు భారత్ ఈ సమావేశానికి ఆతిథ్యం ఇవ్వాల్సి ఉన్నా అది కుదరలేదు. అలా ఇటీవలి కాలంలో క్వాడ్‌కు కొన్ని ఆటంకాలు ఎదురైనా, గత ఏడాది జనవరి నుంచి కూటమి దేశాల విదేశాంగ మంత్రులు అయిదుసార్లు, అధికారులు అనేకసార్లు భేటీ అయ్యారు. పైగా భారత్, జపాన్, ఆస్ట్రేలియా ప్రధానులు క్రమం తప్పకుండా చర్చలు జరిపారు. జపాన్ ప్రధాని తకాయిచి భారత పర్యటనతో ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడింది. ఈ ఏడాది జులైలో ప్రధాని మోదీ వార్షిక శిఖరాగ్ర సమావేశం కోసం ఆస్ట్రేలియాలో పర్యటించారు.

ప్రత్యేక పరిస్థితుల్లో...

తాజా క్వాడ్ సమావేశం ప్రత్యేక భౌగోళిక రాజకీయ పరిస్థితుల మధ్య జరిగింది. ఉక్రెయిన్ యుద్ధం మొదలై నాలుగేళ్లు దాటిపోగా, ఇరాన్ యుద్ధం కూడా ఇంకా పూర్తిగా ముగియలేదు. మరోవైపు దక్షిణ చైనా సముద్రంలో ఫిలిప్పీన్స్ నౌకాదళంపై చైనా దూకుడుగా వ్యవహరిస్తోంది. సెంకాకు దీవులు, తైవాన్ విషయంలో డ్రాగన్ వైఖరిపై ఆందోళనలు పెరిగాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జీ-2 (అమెరికా-చైనా) గురించి ప్రస్తావించడం; రష్యా, చైనా, అమెరికా నేతల సమావేశం గురించి మాట్లాడటం వల్ల, ఇండో-పసిఫిక్‌లోని తన మిత్రదేశాలను, భాగస్వాములను అగ్రరాజ్యం వదిలేస్తోందనే గుసగుసలు వినిపించాయి. ఈ నేపథ్యంలో మనీలా సమావేశంలో స్వేచ్ఛాయుత, సుస్థిర ఇండో-పసిఫిక్ ప్రాంతానికి క్వాడ్ దేశాలు నాలుగు మూలస్తంభాల వంటివని ట్రంప్ ఉద్ఘాటించడం మిత్రదేశాలకు భరోసానిచ్చింది. విడివిడిగా కంటే ఈ నాలుగు దేశాల కలయిక ఎంతో శక్తిమంతమైనదని ఆస్ట్రేలియా ప్రధాని పేర్కొనగా, ఇండో-పసిఫిక్ భవిష్యత్తును తాము కలిసికట్టుగా తీర్చిదిద్దుతామని జపాన్ ప్రధాని అన్నారు. సరఫరా గొలుసులు, సముద్ర భద్రత, కొత్త సాంకేతికతలు, విపత్తు స్పందన వంటి రంగాల్లో సహకారాన్ని పెంచే నిర్మాణాత్మక భాగస్వామ్యమే క్వాడ్ అని భారత ప్రధాని మోదీ అభివర్ణించారు. కీలక సరఫరా గొలుసుల భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, కృత్రిమ మేధ (ఏఐ)లో సహకారం, అనుసంధాన కారిడార్ల మెరుగుదలపై సంయుక్త ప్రకటనలో నేతలు పిలుపిచ్చారు. వచ్చే ఏడాది భారత్‌లో తొలి క్వాడ్ బిజినెస్ లీడర్స్ ఫోరమ్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పలు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకున్న భారత్, త్వరలో అమెరికాతోనూ ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ ఫోరమ్ భేటీలు క్రమం తప్పకుండా జరిగితే భారత ఆర్థిక వ్యవస్థకు మేలు జరగడంతో పాటు ప్రపంచ సరఫరా గొలుసులలో మన దేశం కీలక శక్తిగా ఎదుగుతుంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో నిఘా పెంచడానికి మొన్న మే నెలలో 'ఇండో-పసిఫిక్ మారిటైమ్ సర్వైలెన్స్ కొలాబరేషన్' ప్రకటించారు. 2027లో తొలిసారిగా క్వాడ్ దేశాల పి-8, పి-8ఐ గస్తీ విమానాలు సంయుక్తంగా సముద్ర విన్యాసాలు జరుపుతాయని మనీలాలో నేతలు వెల్లడించారు. హిందూ మహాసముద్రంలో చైనా ఉనికి, హార్మూజ్ జలసంధి మూసివేత, మలక్కా జలసంధి ప్రాధాన్యం దృష్ట్యా ఈ విన్యాసాలు క్వాడ్ దేశాల సముద్ర సామర్థ్యాలను బలోపేతం చేస్తాయి. పసిఫిక్ ద్వీప దేశాలకు కేబుల్ అనుసంధానాన్ని మెరుగుపరచడానికి 2023 మేలో క్వాడ్ కేబుల్ అనుసంధాన, పునరుత్థాన భాగస్వామ్యం ప్రారంభమైంది. హిందూ మహాసముద్రంలో కొత్తగా చేపట్టనున్న సముద్రగర్భ కేబుల్ ప్రాజెక్టులను తాజా క్వాడ్ సమావేశం స్వాగతించింది. ఏఐ, సైబర్ భద్రతలో మెరుగైన సహకారం, ఉగ్రవాద నిరోధం, మానవతా సాయం, విపత్తు నివారణ వంటి ఇతర రంగాలలో కూడా సహకారం పెంచాలని తాజా క్వాడ్ సమావేశం పిలుపిచ్చింది. మరోవైపు, భారత్‌కు క్వాడ్ దేశాలు ముఖ్యమైన ఆర్థిక భాగస్వాములుగా ఉన్నాయి. నిరుడు అమెరికాతో భారత్ వస్తు వాణిజ్యం సుమారు 14,910 కోట్ల డాలర్లు కాగా, రక్షణ సహకారం కూడా పెరుగుతోంది. 2025-26లో జపాన్‌తో మన వాణిజ్యం 2,747 కోట్ల డాలర్లు కాగా, ఆస్ట్రేలియాతో వాణిజ్యం 2,410 కోట్ల డాలర్లుగా నమోదైంది. ఆస్ట్రేలియా నుంచి భారత్ ఇంధన, ఖనిజ దిగుమతులు చేసుకుంటోంది. అమెరికా తరహాలోనే అక్కడా భారతీయులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

పెరుగుతున్న ఆదరణ

క్వాడ్‌తో పాటు ఎస్‌సీవో, బ్రిక్స్ కూటములలోనూ భారత్ భాగస్వామిగా ఉంది. క్వాడ్ కోసం ఇతర కూటములను వదులుకోవాల్సిన అవసరం లేదు. ఆసియా-ఐరోపా దేశాలకు ఎస్-సీవో, అభివృద్ధి చెందుతున్న దేశాలకు బ్రిక్స్ వేదికలైతే- ఆర్థిక అనుసంధానం, నమ్మకమైన సరఫరా గొలుసుల కోసం క్వాడ్ కీలకంగా మారింది. ప్రాంతీయంగానూ క్వాడ్‌కు ఆదరణ పెరుగుతోంది. దశాబ్దం క్రితం, క్వాడ్ కూటమి ఆవిర్భావం వల్ల ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఆగ్నేయాసియా దేశాల సంఘం-ఆసియాన్‌కు ప్రాధాన్యం తగ్గుతుందేమోననే ఆందోళన ఉండేది. ఆ అంచనాలకు విరుద్ధంగా, ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలు గణనీయంగా బలపడ్డాయి. అదేవిధంగా, ఆగ్నేయాసియా దేశాలతో జపాన్, ఆస్ట్రేలియాల సంబంధాలు కూడా ఇటీవల సుస్థిరమయ్యాయి. అయితే జాతీయ రాజకీయాలు, సుంకాల విధానం, ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాల వల్ల అమెరికా అధ్యక్షుడు క్వాడ్‌పై పూర్తిస్థాయి ఉత్సాహం చూపలేకపోవచ్చు. మంత్రులు, అధికారుల స్థాయిలో మాత్రం పురోగతి ఉంటుంది. ఆ మేరకు సమష్టి శ్రేయస్సు కోసం క్వాడ్ దేశాల అత్యున్నత రాజకీయ నాయకత్వం సదా కూటమికి ప్రాధాన్యం ఇవ్వాలి. తాజా మనీలా సదస్సు క్వాడ్‌కు కొత్త దిశానిర్దేశం చేస్తుందో లేదో వేచి చూడాలి.

ఒకే విద్యావిధానం.. రైటా.. రాంగా?



దేశవ్యాప్తంగా నూతన జాతీయ విద్యా విధానంపై అమలుపై చర్చ జరుగుతున్న వేళ తెలంగాణలో విద్యా సంస్కరణల దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2027-28 విద్యాసంవత్సరం నుంచి కొత్త విద్యా విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం.. ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసి 10+2 విధానాన్ని కొనసాగిం చాలనే ఆలోచనలో ఉంది. నిజానికి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఒకే రకమైన 5+3+3+4 విద్యా విధానం అమల్లోకి వస్తే, విద్యార్థులు ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి మారినప్పుడు చదువుకు ఎటువంటి ఆటంకం కలగదు. 6వ తరగతి నుండే వృత్తి విద్యా కోర్సులు, కోడింగ్, ఉన్నత విద్యలో మల్టీ-డిసిప్లినరీ విధానం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరిగి, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తయారవుతారని కేంద్ర విద్యా శాఖ ఆలోచన.

ఒకే విద్యా విధానం బెస్ట్.. కానీ!

దేశవ్యాప్తంగా ఒకే విధానం ఉంటే 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్' (ఏబీసీ) ద్వారా ఏ యూనివర్సిటీలోనైనా సులభంగా ప్రవేశాలు పొంద వచ్చు. కొన్ని మార్పులతో చీజ్రూని అమలు చేయవచ్చు. రాష్ట్రాల సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానం ఉండా లని, త్రిభాషా సూత్రం, కొన్ని నిబంధనలపై స్థానిక పరిస్థితులకు తగ్గట్టు మార్పులు అవసరమని తెలంగాణ విద్యా కమిషన్ అభిప్రాయం. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం కేంద్ర విధానంలోని సానుకూల అంశాలను (ఉన్నత విద్యలో క్రెడిట్ విధానం వంటివి) తీసుకుంటూనే, పాఠశాల విద్యలో రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా సొంత విధానాన్ని రూపొం దించే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది. తాజా పరిణా మాల ప్రకారం అసంబంధంగా కేంద్ర నిధులు ఆపుతారనే నెపంతో తెలంగాణలో చీజ్రూ స్వల్ప మార్పులతో అమలు చేయాలని చూస్తున్నారు.

ఎన్ఈపీ అమలు ఉపయోగకరమే..!

తెలంగాణ రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం (2027-28) నుండి కొత్త విద్యావిధానం అమల్లోకి రానుంది. ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసి, 10+2 విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానం వల్ల పెద్దగా విద్యా వ్యవస్థలో మార్పులు జరగవు.. హడావిడిగా విద్యావిధానాన్ని సంస్కరించే బదులు నూతన జాతీయ విద్యా విధానాన్ని యథాతథంగా తెలంగాణలో అమలు పరచడం ఉపయోగకరంగా ఉంటుంది. 10+2 విధానం పేరుతో విద్యా సంస్కరణలను పరిమితం చేయొద్దు. చీజ్రూ-2020 సూచించిన 5+3+3+4 విద్యా విధానాన్ని సమగ్రంగా అమలు చేయాలి. తెలంగాణ రాష్ట్రంలో 10+2 విద్యా నిర్మాణాన్ని మాత్రమే అమలు చేయడం ద్వారా జాతీయ నూతన విద్యా విధానం లక్ష్యాలను సాధించలేం. చీజ్రూ-2020 ప్రకారం సూచించిన 5+3+3+4 విద్యా నిర్మాణం కేవలం తరగతుల విభజనకు సంబంధించినది మాత్రమే కాదు. పిల్లల వయస్సు, మానసిక వికాసం, అభ్యసన సామర్థ్యాలకు అనుగుణంగా విద్యాబోధనలో సమూల మార్పులు తీసుకురావడం దీని ప్రధాన ఉద్దేశం.

సమగ్ర విద్యా సంస్కరణలే లక్ష్యం!

నిరంతర మూల్యాంకనం, పరీక్షా విధానాల సంస్కరణలు లేకుండా కేవలం విద్యా నిర్మాణాన్ని మార్చడం వల్ల ఆశించిన ఫలితాలు సాధ్యం కావు.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం, ప్రతి తరగతికి ఉపాధ్యాయుడు, తగిన తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, డిజిటల్ సదు పాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయులకు నాణ్య మైన శిక్షణ, అవసరమైన బోధనా సామగ్రి అందించాల్సిన అవసరం ఉంది. చీజ్రూ-2020 సూచించిన 5+3+3+4 విద్యా నిర్మాణాన్ని సమగ్రంగా అమలు చేయాలి. బోధనా పద్ధతులు, పాఠ్య ప్రణాళిక, మూల్యాంకన విధానాల్లో సమూల సంస్కరణలు తీసుకురావాలి. ఆరవ తరగతి నుంచే వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధికి అవకాశాలు కల్పించాలి. విద్యా సంస్కరణలు అనేవి కేవలం పేర్లు, తరగతుల విభజనల మార్పు లకు పరిమితం కాకూడదు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ, పేద, గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా ప్రభు త్వం చర్యలు చేపట్టాలి. కేవలం 10+2 కాదు.. సమగ్ర 5+3+3+4 విద్యా సంస్కరణలే లక్ష్యం కావాలి.

ఊహాశక్తికి రెక్కలు తొడిగే ఫాంటసీ సినిమా..



వాస్తవానికీ, కల్పనకు మధ్య ఒక అదృశ్యమైన వంతెనను నిర్మించి, ప్రేక్షకుడిని మరో ప్రపంచంలోకి తీసుకువెళ్లే శక్తి సినిమాకు ఉంది. ఆ శక్తికి అత్యంత ఆసక్తికరమైన రూపమే ఫాంటసీ. మనిషికి ఊహాశక్తి పుట్టినప్పటి నుంచీ మాయాజాలం అతని కథల్లో భాగమైంది. అమ్మమ్మ చెప్పిన అద్భుత కథలు, జానపద గాథల్లోని మంత్రశక్తులు, పురాణాల్లోని దేవతలు, రాక్షసులు, అదృశ్యమయ్యే పాత్రలు, రూపాంతరాలు ఇవన్నీ మనిషి ఊహాలోకానికి పునాదులు వేశాయి.. కాలక్రమంలో ఆ కథలు సాహిత్యాన్ని దాటి నాటకాల్లోకి, అక్కడి నుంచి సినిమాల్లోకి ప్రవేశించాయి. ఒకప్పుడు మాటల్లో మాత్రమే ఊహించుకున్న అద్భుత ప్రపంచాలను కెమెరా మన కళ్లముందు నిలబెట్టింది.

చిన్నారితో పెరిగిన అనుబంధం..

డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ సినిమా కథ విషయానికి వస్తే సూరి డబ్బు సంపాదించడమే జీవిత లక్ష్యంగా పెట్టుకుని చిన్న చిన్న మోసాలు చేస్తూ బతుకుతుంటాడు. సూరి (ఫహద్ ఫాజిల్) హైదరాబాద్‌లో జీవించే ఒక అనాథ. అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తూ, అదనపు డబ్బు సంపాదించడానికి చిన్న చిన్న మోసాలకు పాల్పడు తుంటాడు. అతని జీవితంలో డబ్బు సంపాదించడమే ప్రధాన లక్ష్యం. ఒక సందర్భంలో అస్లాం భాయ్ అనే వ్యక్తి దగ్గర చిక్కుకుని, జూదం ఆడి తక్కువ సమయంలో పెద్ద మొత్తంలో డబ్బు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అనుకోకుండా అతనికి దివ్య (స్నైరా పలేకర్) అనే చిన్నారి పరిచయమవుతుంది. తన తల్లి దండ్రులు కనిపించకుండా పోయారని, వారిని వెతికి పెట్టాలని దివ్య సూరిని కోరుతుంది. మొదట ఆమె అభ్యర్థనను కూడా తన స్వార్థానికి ఉపయోగించుకోవాలనుకున్న సూరి, క్రమంగా ఆ చిన్నారితో అనుబంధాన్ని పెంచుకుంటాడు.

మనిషి సాగించిన భావోద్వేగ ప్రయాణం..

అయితే దివ్య సాధారణమైన చిన్నారి కాదని, ఆమె ఒక ఆత్మ అని, ప్రమాదంలో మరణించిందని తెలుసుకుంటాడు సూరి. ఆమె తల్లిదండ్రులను చేరుకోవాలనే కోరిక వెనుక ఉన్న బాధను, ఆవేదనను అర్థం చేసుకుంటాడు. ఈ ప్రయాణంలో సూరి జీవిత దృక్పథం మారుతుంది. డబ్బు, స్వార్థం చుట్టూ తిరిగే అతని ఆలోచనలు ప్రేమ, అనుబంధం, బాధ్యత వైపు మళ్లుతాయి. చివరకు దివ్య కోరిక నెరవేర్చడం కోసం అతను చేసే ప్రయత్నం అతనిలోని మానవత్వాన్ని ఆవిష్కరిస్తుంది. ఒక మోసగాడి జీవితంలోకి ప్రవేశించిన ఒక చిన్నారి అతని మనసును ఎలా మార్చింది? మరణించిన బాలికకు తన తల్లిదండ్రులపై ఉన్న ప్రేమ ఎలాంటి మానవీయ అనుబంధానికి దారితీసింది? అన్నదే ఈ సినిమా కథలోని ప్రధానాంశం. ఇది మొత్తంగా ఒక చిన్నారి ఆత్మ చుట్టూ అల్లుకున్న ఫాంటసీ కథ మాత్రమే కాదు.. స్వార్థం నుంచి మాన వత్వం వైపు ఒక మనిషి సాగించిన భావోద్వేగ ప్రయాణం. మొదట్లో స్వార్థం, డబ్బు సంపాదన అనే ఆలోచనలతో ఉన్న సూరి, క్రమంగా దివ్యతో ఏర్పడిన అనుబంధం వల్ల మార్పునకు గురవుతాడు. ఆ చిన్నారి పట్ల బాధ్యత, ప్రేమ, ఆప్యాయత అతనిలోని మానవత్వాన్ని మేల్కొలుపుతాయి.

అమాయకత్వమే ఫాంటసీ కథలకు ముడిసరుకు..

ఇక్కడ దర్శకుడు ఒక మంచి ఆలోచనను ప్రతిపాదిస్తాడు. మనిషి సృష్టించే మాయాజాలం కన్నా, మనిషిలో సహజంగా ఉండే ప్రేమ, నమ్మకం, అనుబంధాలే గొప్ప అద్భుతాలని సూచిస్తాడు. ఈ సినిమాలో ఫహద్ ఫాజిల్ నటన ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. పాత్రలోని స్వార్థం, భయం, ఆశ, అయోమయం, క్రమంగా ఏర్పడే మాన వీయ పరివర్తనలను తన సహజమైన నటనా శైలిలో వ్యక్తీకరిస్తాడు. అతని ముఖకవళికల్లోని సూక్ష్మత, సంభాషణల్లోని విరామాలు, శరీర భాష పాత్రకు సహజత్వాన్ని తీసుకొస్తాయి. దివ్య పాత్ర కథలో అత్యంత కీలకమైంది. పిల్లల ప్రపంచం పెద్దల ప్రపంచానికి భిన్నంగా ఉంటుంది. పెద్దలకు అసాధారణంగా కనిపించేది పిల్ల లకు సహజంగా అనిపించవచ్చు. వారి ఊహాశక్తికి హద్దు లు ఉండవు. ఈ అమాయకత్వమే ఫాంటసీ కథలకు గొప్ప ముడిసరుకు. దివ్య పాత్ర ద్వారా బాల్యంలోని ఆశ్చర్యం, నమ్మకం, అన్వేషణలను దర్శకుడు కథలోకి తీసుకొస్తాడు. సూరి, దివ్యల మధ్య ఏర్పడే అనుబంధమే ఈ సినిమాలోని భావోద్వేగ కేంద్రం.

ఫాంటసీకి, మ్యాజిక్ రియలిజంకి మధ్య తేడా..

ఈ సినిమాలో ఫాంటసీకి, మ్యాజిక్ రియలిజంకు మధ్య ఉన్న తేడాను మనం గుర్తించాలి. 'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్' ప్రధానంగా ఫాంటసీ, కామెడీ, అడ్వెంచర్ అంశాలతో కూడిన చిత్రం. ఇందులోని మాయాజాలం కథను ముందుకు నడిపించే ప్రధాన సాధనం. అయితే ఆ మాయాజాలం ద్వారా మానవ సంబంధాలను, భావోద్వేగాలను ఆవిష్కరించే ప్రయత్నం దీనికి భిన్నమైన కోణాన్ని అందిస్తుంది. ఫాంటసీ సినిమా విజయానికి కథతో పాటు దేశీయ భాష కూడా అత్యంత ముఖ్యం. తెరమీద ఒక అసాధారణ సంఘటన జరిగినప్పుడు ఆ దృశ్యం ప్రేక్షకుడిలో ఆశ్చర్యాన్ని, ఆసక్తిని, భావోద్వేగాన్ని కలిగించాలి.

మాయాజాలం చుట్టూ అల్లుకున్న ఫాంటసీ..

'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్' ఒక చిన్నారి మాయా శక్తుల చుట్టూ అల్లుకున్న ఫాంటసీ కథ, ఫహద్ ఫాజిల్ నటన, చిన్నారి దివ్య పాత్ర, వారిద్దరి మధ్య ఏర్పడే అనుబంధం సినిమాలో ఆసక్తిని కలిగిస్తాయి. సినిమాలోని మాయాజాలం మన కళ్లను ఆశ్చర్యపరుస్తుంది. కానీ ఆ మాయాజాలం వెనుక ఉన్న మానవీయ అనుభవమే మనసును కదిలిస్తుంది. మనిషి కలలు కనగలిగినంత కాలం ఫాంటసీకి అంతం ఉండదు. ఎందుకంటే వాస్తవం మనకు ఒక ప్రపంచాన్ని ఇస్తే, ఊహాశక్తి అనేక ప్రపంచాలను సృష్టిస్తుంది. మాయాజాలం తెరమీద కనిపించవచ్చు. కానీ నిజమైన అద్భుతం మనిషి ఊహాశక్తిలోనూ, అతని హృదయంలోనూ ఉంటుంది.